
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 20 । జూన్ । 2024



సోమశిలలో 9.372 టీఎంసీలు

సోమశిల : జలాశయంలో బుధవారానికి 9.372 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 4,433 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,628
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,826
నవర (8 గ్రాములు)	రూ.54,608



ఖతర్నాక్ ముఠా

తక్కువ ధరకే బంగారం పేరిట మోసాలకు పాల్పడుతున్న కావలికి చెందిన ముఠా లీడర్‌ను తెలంగాణ రాచకొండ పోలీసులు అరెస్ట్ చేయడంతో గుట్టు రట్టయింది. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎంపిక ప్రక్రియ

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలో పశు సంవర్ధకశాఖలో 1962 వాహనాల అంబులెన్స్‌ల్లో ఉద్యోగ అవకాశాలకు సంబంధించి గురువారం ఎంపిక ప్రక్రియలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మేనేజర్ ఎన్. శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబులెన్స్‌ల్లో పైలట్, ఫెరావిట్, డాక్టర్ పోస్టులకు ఎంపిక నిర్వహిస్తామన్నారు. పైలట్‌కు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు హెవీ లైసెన్సు లేదా బ్యాడ్జి లైసెన్సు ఉండాలని, డాక్టర్ పోస్టుకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్సు ఉండాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు రైల్వేస్టేషన్ సమీపంలోని పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 9704165512 నంబరులో సంప్రదించాలని కోరారు.

కేవీకేలో నూతన శాస్త్రవేత్తల నియామకం



కేవీకేలో నూతనంగా నియమితులైన శాస్త్రవేత్తలు

కందుకూరు: భారత వ్యవసాయ పరిశోధనా మండలి కందుకూరు కృషీ విజ్ఞాన కేంద్రానికి శాశ్వత ప్రాతిపదికన ఆరుగురు నూతన శాస్త్రవేత్తలను నియమించిందని కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త జి. ప్రసాద్‌బాబు తెలిపారు. వీరిలో సస్య ఉత్పత్తి విభాగంలో డాక్టర్ జ్యోతి, సస్యరక్షణ విభాగంలో డాక్టర్ వెంకటేష్, ఉద్యాన విభాగంలో మయాంక్, పశువిజ్ఞాన విభాగంలో డాక్టర్ శ్రీరంగ, గృహ విజ్ఞాన విభాగంలో డాక్టర్ నిహారిక, వ్యవసాయ యాంత్రీకరణ విభాగంలో డాక్టర్ వివేక్‌కామత్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు బాధ్యతలు తీసుకున్నారు. ఈ ఏడాది నుంచి పూర్తి స్థాయిలో రైతులకు శిక్షణా కార్యక్రమాలు, రైతుల పొలాల్లో ప్రదర్శనా క్షేత్రాలు, యువతకు వ్యవసాయ అనుబంధ విభాగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం, చీడ, పీడల నిర్ధారణ చేపట్టి నివారణపై సలహాలు, సూచనలు ఇస్తామని తెలిపారు. రైతులు కందుకూరులోని సీటీఆర్ఐ ప్రాంగణంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి అవసరమైన సలహాలు, సూచనలు శాస్త్రవేత్తల నుంచి పొందవచ్చని తెలిపారు.

520 పొగాకు సూర బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 520 పొగాకు సూర బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 587 బేళ్లు రాగా వాటిలో 520 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. వేలంలో 65,764 కిలోల పొగాకును విక్రయించగా రూ.54,99,208 వ్యాపారం జరిగింది. వేలంలో 8 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుకాసురులు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పట్టుమని పదిరోజులు కాకముందే ఆ పార్టీలోని ఇసుకాసురులు బరి తెగించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు 'ఇసుక ఉచితం' పేరుతో రీచ్‌లను కుళ్లబొడి చేశారు. మరో పక్క వర్షాల్లేక.. నదుల్లో ఇసుక అడుగంటిపోయినప్పటికీ బావుల్లాంటి గోతులు పెట్టి సామాన్య కార్యకర్త నుంచి నియోజకవర్గ లీడర్ వరకు రూ.కోట్లు కొల్లగొట్టారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక పాలసీ తెచ్చి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. ఇసుక విక్రయం ద్వారా వచ్చే ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేర్చింది. దీంతో టీడీపీ ఇసుక దోపిడీకి కళ్లెం పడడంతో అప్పటి ప్రభుత్వంపై ఐదేళ్లుగా దుష్ప్రచారం చేసింది. ఇప్పుడు తిరిగి అధికారం రాగానే టీడీపీ కేడర్ మళ్లీ దోపిడీకి తెగబడుతోంది.





- బరి తెగించిన టీడీపీ నేతలు
- నిశిరాత్రిలో ఇసుక అక్రమ రవాణా
- డంపింగ్ యార్డుల నుంచి యథేచ్ఛగా తరలింపు
- ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- అడ్డుకోలేక చేతులెత్తేసిన అధికారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ ప్రభుత్వం ఇంకా పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. ఎన్నికైన ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. ప్రభుత్వ పాలన ప్రారంభం కాక ముందే టీడీపీ నేతలు బరి తెగిస్తున్నారు. 'ఇసుక ఉచితం' పేరుతో గతంలో ఐదేళ్ల ఏ నాడు ప్రజలకు ఉచితంగా ఇవ్వలేదు. ఇసుక రీచ్‌ల్లో టీడీపీ కేడర్ మోహరించి ట్రాక్టర్‌కు ఇంత.. టిప్పర్‌కు ఇంత చొప్పున దోపిడీ చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ దోపిడీకి అడ్డుకట్ట పడడంతో తప్పుడు, దుష్ప్రచారంతో చెలరేగిపోయిన టీడీపీ ముఠా.. తిరిగి అధికారంలోకి రావడంతో మళ్లీ బరి తెగించారు. కౌంటింగ్ అయిన మరుసటి రోజు నుంచి టీడీపీ కేడర్ ఇసుక రీచ్‌లతో పాటు డంపింగ్ యార్డుల్లో పడి అడ్డూఅదుపు లేకుండా దోచుకెళ్తున్నారు.

డంపింగ్ యార్డుల్లో సగం ఖాళీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక బ్లాక్ మార్కెట్, ట్రాన్స్‌పోర్టర్ల సిండికేట్‌కు చెక్ పెడుతూ నూతన పాలసీ తెచ్చింది. జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో ఇసుక డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. ఆయా డంపింగ్ కేంద్రాల్లో టన్ను ఇసుకకు రవాణా చార్జీలతో కలిసి చెల్లించితే నేరుగా కొనుగోలుదారుడి ఇంటి వద్దకే చేర్చే విధంగా అప్పటి ప్రభుత్వం విధి విధానాలు రూపొందించింది. జిల్లాలో పెన్నానదిలో వివిధ రీచ్‌ల నుంచి ఇసుకను తరలించి డంపింగ్ యార్డుల్లో సుమారు 5 లక్షల యూనిట్లు నిల్వ చేశారు. ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు జిల్లాలోని పొట్టేపాళెం, మర్రిపాడు డంపింగ్ యార్డుల్లో దాదాపు 1.50 లక్షల యూనిట్లు నిల్వ ఉన్నట్లు సంబంధిత మైనింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఎన్నికల్లో జిల్లాలో టీడీపీ గెలవడంతో పాటు రాష్ట్రంలోనూ ఆ పార్టీ అధికారం చేజిక్కించుకోవడంతో టీడీపీలోని ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్ యార్డుల్లో దొంగల్లా పడి రేయింబవళ్లు ఇసుకను దోచేస్తున్నారు. నెల్లూరు రూరల్, ఆత్మకూరు నియోజకవర్గాల్లో స్థానిక టీడీపీ నేతలు ఇసుకను అక్రమ రవాణా సాగిస్తున్న వైనం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

- నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాళెం ఇసుక రీచ్‌లో రెండు వారాలుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. స్థానిక టీడీపీ నేతలు రీచ్‌ల్లో రాత్రి వేళల్లో వందలాది వాహనాలతో ఇసుక అక్రమ రవాణా సాగించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఇసుక విక్రయాలపై నిషేధం కొనసాగుతోంది. అయినా గత రెండు వారాలుగా ఇసుకను టీడీపీ నేతలు, కార్యకర్తలు దోచుకెళ్తున్నా.. ఏ అధికారి ఆ వైపు కన్నెత్తి చూసేందుకు సాహసం చేయలేదు. స్థానిక నేతలు రీచ్‌ల్లో భారీ యంత్రాలు ద్వారా ఇసుకను తవ్వి టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకున్నారు. టిప్పర్‌కు ఏడు, పది యూనిట్లు పరిమితికి మించి ఇసుక రవాణా సాగించారు. దాదాపు 100కు పైగా వాహనాలు ద్వారా రోజుకు 1000 యూనిట్లకు పైగా ఇసుక అక్రమ రవాణా చేసినట్లు సమాచారం. నరసింహకొండ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో నిల్వ ఉంచిన ఇసుక నిల్వలో సగం ఖాళీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడులో ఉన్న డంపింగ్ యార్డులో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గత వారం రోజుల నుంచి నియోజకవర్గానికి సంబంధించిన ఓ నేత డంపింగ్ యార్డును స్వాధీనం చేసుకుని రోజు వారీగా విక్రయాలు చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి రోజు 50కు పైగా వాహనాల ద్వారా డంపింగ్ యార్డు నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి రోజు నిశిరాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నాయి. ఇసుక తొలకాలపై నిషేధం ఉన్నప్పటికీ స్థానికంగా ఉన్న రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

ఎమ్మెల్యే సీరియస్

నెల్లూరు రూరల్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా చేస్తే సహించబోమని స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో అక్రమ రవాణాదారులను హెచ్చరించారు. రూరల్ పరిధిలో ఇసుక రవాణా జరుగుతున్న విషయం ఆయన దృష్టికి వెళ్లడంతో వెంటనే నిలిపి వేయాలని ఆదేశించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఎమ్మెల్యే ప్రకటనతో ఇసుక రవాణా ఆగుతుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.

మా దృష్టికి రాలేదు

నెల్లూరు రూరల్, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలో డంపింగ్ యార్డుల్లో ఇసుకను అక్రమ రవాణా సాగిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పొట్టేపాళెం ఇసుక రీచ్ నుంచి ఇసుక రవాణా సాగిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలోని డంపింగ్ యార్డుల్లోని ఇసుకపై నిర్ణయం తీసుకుంటాం.

– ఎ.శ్రీనివాసకుమార్, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి

రైతులను ఉదారంగా ఆదుకోవాలి

- కరువు దృష్ట్యా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేయాలి
- కేంద్ర కరువు బృందం సభ్యులకు కలెక్టర్ హరినారాయణన్ వినతి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని పశ్చిమ ప్రాంత మండలాల్లో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా రైతులను ఆదుకునేందుకు ఉదారంగా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేయాలని కేంద్ర కరువు బృందం సభ్యులను కలెక్టర్ ఎం.హరినారాయణన్ కోరారు. జిల్లాలో కరువు పరిస్థితులను అంచనా వేయడానికి విచ్చేసిన కేంద్ర బృంద సభ్యులు మన్ను జీ ఉపాధ్యాయ్, ఎస్‌సీ కష్యప్, మదన్‌మోహన్ మౌర్యబి అనురాధ బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో సమావేశమయ్యారు. జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను శాఖల వారీగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. జిల్లాలోని వలేటివారిపాళెం, కందుకూరు, లింగసముద్రం, సీతారామపురం, వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు, మర్రిపాడు, కలువాయి మండలాలను జాతీయ విపత్తుల సంస్థ కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. పది మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. సీతారామపురంలో 50 శాతానికి పైగా, మిగిలిన 9 మండలాల్లో 30 నుంచి 40 శాతం మేర పంట నష్టం వాటిల్లిందన్నారు. ఈ పది మండలాల్లో 7,156 మంది రైతులు సాగు చేసిన 9,053.21 హెక్టార్లలో వరి, శనగ, వేరుశనగ, మినుము, చిరుధాన్యాలు మొదలగు పంటలు దెబ్బతిని నష్టపోయారని, వీరిని ఆదుకునేందుకు రూ.849.25 లక్షలతో ఇన్‌పుట్ సబ్సిడీ అంచనాలను కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. సీతారామపురంలో అత్యధికంగా 148 మంది రైతులు 69 హెక్టార్లలో పంటలు నష్టపోయారని, వీరికి 9.25 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అంచనా వేసినట్లు చెప్పారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించి 7,42,306 చిన్న పెద్ద పశు నష్టం జరగ్గా, ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు 5,302 పశువులకు నష్ట పరిహారం చెల్లించేందుకు అవకాశం ఉందని, ఈ పది మండలాల్లో పశుదాణా, మందుల కోసం రూ.291.15 లక్షలు బడ్జెట్ అవసరమని అంచనా వేసినట్లు వివరించారు. గ్రామీణ మంచినీటి సరఫరా విభాగానికి సంబంధించి కరువు మండలాల్లో నీటి ఎద్దడిని అధిగమించేందుకు బోర్ వెల్స్, సీసీడబ్ల్యూఎస్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు. తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న సీతారామపురం మండలంలో కూడా నీటి సమస్యను పరిష్కరించేందుకు ట్యాంకర్ల ద్వారా అవసరమైన నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 10 కరువు మండలాల్లో వ్యవసాయం, రూరల్ వాటర్ సప్లయీ, పశు సంవర్ధకశాఖలకు సంబంధించి రైతులను ఆదుకునేందుకు రూ.1,335.6 లక్షల మేర నిధులు అవసరమని కలెక్టర్ కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. జిల్లాలో వర్షాలు చెదురుముదురుగానే కురుస్తున్నాయని, రానున్న రెండు నెలలు ఇదే పరిస్థితి ఉంటే మెట్ట ప్రాంతాల్లో తాగు, సాగునీటికి ఇబ్బందులు కలుగుతాయని, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని చేయాల్సి వస్తుందని చెప్పారు. ఈ పరిస్థితులను జిల్లాకు నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కేంద్ర బృంద సభ్యులకు కలెక్టర్ కోరారు.



కేంద్ర బృంద సభ్యులకు కరువు నష్ట పరిస్థితులను వివరిస్తున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించిన కేంద్ర బృందం

శంకరన్ సమావే మందిరంలో కరువు పరిస్థితులను వివరించే ఫొటోలతో సమాచార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పశు సంవర్ధక శాఖల సంబంధించిన జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు ఫొటోలతో కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ లవన్న, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, పశు సంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు, నుడా వీసీ బాపిరెడ్డి, సీపీఓ రాజు, ఇరిగేషన్ డీఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ తిరుమల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్ట్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు బీపీటీ, ఎంపీటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పొందాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు రెవెన్యూ డే



సమావేశం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు (దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ విన్నపం మేరకు ప్రభుత్వం జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రకటిస్తూ జీఓ జారీ చేసిందని, ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్లు ఆ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి జిల్లా కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు తెలిపారు. జిల్లా అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖలో విశిష్ట సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన పెద్దలను రెవెన్యూ డే రోజు సన్మానించాలని, రెవెన్యూ శాఖ ప్రజలకు, రైతులకు అందిస్తున్న సేవలను అందరికి అవగాహన కల్పించాలని డివిజన్ స్థాయి నాయకులతో చర్చించారు. జిల్లాలోని అన్ని డివిజన్లలో రెవెన్యూ డే ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తీర్మానించారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ డే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్న కలెక్టర్, డీఆర్వో, కలెక్టరేట్ ఏఓకు కృతజ్ఞతలు తెలిపారు.

జూలై 12 వరకు 'నేను బడికి పోతా' కార్యక్రమం

నెల్లూరు (టౌన్): బడి బయట పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించే విధంగా 'నేను బడికి పోతా' ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ప్రక్రియను వచ్చే నెల 12 వ తేదీ వరకు కొనసాగించాలని డీఈఓ పీవీజే రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు బడిలోనే ఉండాలని, డ్రాపౌట్ పిల్లలను మళ్లీ బడిలో చేర్పించాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది సహాయంతో ప్రతి గ్రామం, ఆవాస ప్రాంతాల్లోని ప్రతి ఇంటిని సర్వే చేసి బడి బయట పిల్లలను గుర్తించాలన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ఉపయోగాలు, పథకాలపైఅవగాహన కల్పించాలన్నారు.

ఉపాధిపై 'తమ్ముళ్ల' కళ్లు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆదాయ వనరులు కోసం వేట ప్రారంభించారు. గతంలోనూ ఆధారాల్లేకుండా అడ్డంగా దోచుకున్న ఉపాధి హామీ పథకంపై ఆ పార్టీ కేడర్ కన్ను మరోసారి పడింది. ఈ పథకం ద్వారా దోచుకునేందుకు తమకు అనుకూలమైన వారిని నియమించుకునే వరకు ఎక్కడా ఉపాధి పనులు చేయొద్దని సంబంధిత అధికారులను మౌఖికంగా ఆదేశించడంతో అనధికారికంగా పనులు ఆపేశారు. దీంతో పనుల్లేక.. బతుకుదెరువు లేక కూలీలు అల్లాడుతున్నారు. రెండు వారాలుగా ఆకలితో అలమటిస్తున్నారు. మరో వైపు తమ అనుకూల ప్రాంతాల్లో పోస్టింగ్‌ల కోసం సంబంధిత ఉద్యోగులు నాయకుల చుట్టూ తిరుగుతుండడం కొసమెరుపు.



- దోచుకునేందుకు పనులు ఆపేసిన వైనం
- ఉపాధి పనుల్లేక కూలీల ఆకలి కేకలు
- కావాల్సిన సిబ్బంది నియామకం కోసం పైరవీలు
- క్షేత్రస్థాయి సహాయకుల పోస్టులకు బేరాలు
- అనుకూల స్థానాల కోసం నేతల చుట్టూ తిరుగుతున్న ఏపీఓ, ఈసీ, టీఏలు

ఉదయగిరి: టీడీపీ ప్రభుత్వ హయాం (2014–19)లో ఉపాధి హామీ పథకం తెలుగు తమ్ముళ్ల పాలిట కల్పవృక్షంగా మారింది. ఆ పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఈ పథకం కాసుల వర్షం కురిపించింది. దీంతో ఆ పథకంలో రుచి చూసిన తుమ్ముళ్లు తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముందుగా 'ఉపాధి'పై దృష్టి సారించారు. ఈ పథకం ద్వారా జేబులు నింపుకొనేందుకు తెలుగు తమ్ముళ్లు వెంపర్లాడుతున్నారు. ఆ శాఖపై పెత్తనం చెలాయించి తాము పెద్ద మొత్తంలో 'ఉపాధి' పొందేందుకు ప్రయత్నాలు తమ్ముళ్లు ప్రారంభించారు. దీంతో ముందుగా ఉపాధి పనులు ఆపేశారు. అన్నీ పనులు సజావుగా పూర్తి చేసేంత వరకు పనులు పెట్టవద్దు అని టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. దీంతో రెండు వారాల నుంచి జిల్లా వ్యాప్తంగా పనులు ఆగిపోయాయి. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో కీలకంగా ఉండే 'ఫీల్డ్ అసిస్టెంట్' పోస్టుకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టుల కోసం అప్పుడే బేరసారాలు కూడా మొదలయ్యాయి. ఇది ఇలా ఉండగా నిలిచిపోయిన పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియక కూలీలు పనులు కోసం ఎదురు చూస్తున్నారు.

రెండు వారాలుగా ఉపాధి కూలీల ఆకలి కేకలు

జిల్లాలో 37 మంది ఏపీఓలు, 36 మంది ఈసీలు, 185 మంది టీఏలు, 1,185 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 4.35 లక్షల మంది ఉపాధి పనుల కోసం జాబ్ కార్డులు కలిగియున్నారు. వీరికి ప్రతి నెల సుమారు రూ.200 కోట్ల మేర కూలీ నగదు ప్రభుత్వం చెల్లిస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే అధికార పార్టీ నేతలు మండల స్థాయిల్లో సమావేశాలు పెట్టి తమ అనుమతి లేకుండా ఎక్కడా పనులు పెట్టొద్దు అంటూ స్థానిక నేతలు హుకుం జారీ చేశారు. దీంతో చేసేది ఏమీ లేక ఉపాధి పనులు ఆపేశారు. దీంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. అంతేకాక అంతకు ముందు జరిగిన పనులకు కూడా ఇంకా నగదు రాలేదు. ఎప్పుడు పనులు ప్రారంభిస్తారో తెలియక పనులు కోసం గ్రామీణ ప్రాంత కూలీలు బతుకుదెరువు లేక ఇబ్బందులు పడుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే ఏపీఓలు, ఈసీలు, టీఏలు తమకు అనుకూల ప్రదేశాలకు పోస్టింగ్ కోసం ప్రయత్నంలో బిజీబిజీగా ఉన్నారు. తాము కోరుకున్న చోటుకు పోస్టింగ్ వేయిస్తే ప్రతిఫలంగా ఎంతో కొంత చెల్లించేందుకు కూడా ఆసక్తి చూపుతున్నారు. గత ప్రభుత్వంలో ఉన్న 'ఫీల్డ్ అసిస్టెంట్ల'ను పూర్తిగా తొలగించి తమ పార్టీ అనుకూల వ్యక్తులను నియమించుకునేందుకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలోకి వెళ్లిన ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా సొంత పార్టీ నేతలు తొలగించే ప్రయత్నాలు చేస్తుండడంతో సొంత గూటిలో కొంత సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ పోస్టుకు మంచి గిరాకీ ఉండడంతో ఏ మేరకు డబ్బులు ఇస్తారో అనే బేరాలు కూడా సాగుతున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్యను బట్టి బేరం పెంచుతున్నారు. కొన్ని పంచాయతీల్లో ముందుస్తు ఒప్పందం చేసుకుని ప్రతి నెలా నిర్దిష్ట మొత్తంలో స్థానిక నేతల అకౌంట్లలో చేసే విధంగా సెటిల్ చేసుకుంటున్నారు. ఆ వ్యవహారం వారం రోజుల్లో పూర్తి చేసుకుని పనులు ప్రారంభించే విధంగా నియోజకవర్గ వ్యాప్తంగా నేతలు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి



గ్రామాల్లో ఉపాధి పనులు నిలిపివేయడంతో పనులు లేక ఇంటి వద్దనే ఉండాల్సిస్తోంది. పనులు ఎందుకు ఆపేశారనే అడిగితే సమాధానం చెప్పే వారే లేరు. పైఅధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే పనులు ఆపేశారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం మారితే పనులు ఆపేస్తే కూలీలు పరిస్థితి ఇబ్బందిగా ఉంది. వెంటనే పనులు ప్రారంభించి కూలీలకు పనులు చూపించాలి.

– బాషా, గండిపాళెం, ఉదయగిరి మండలం

పనులు జరుగుతున్నాయి

జిల్లాలో ఉపాధి పనులు ఎక్కడా ఆపివేయలేదు. పనులు జరుగుతున్నాయి. స్థానిక పరిస్థితులను బట్టి అక్కడక్కడ కూలీల సంఖ్య తగ్గి ఉండొచ్చు. పూర్తిస్థాయిలో కూలీలను అవగాహన కల్పించి పనులకు వచ్చేలా చేస్తాం. రోజుకు లక్ష పని దినాలు టార్గెట్ పెట్టుకుని ఇంత వరకు సగటున 70 వేల వరకు కూలీలు పని చేశారు. త్వరలో పెద్ద సంఖ్యలో కూలీలు ఉపాధి పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకట్రావు పీడీ, డ్వామా

ఖతర్నాక్ ముఠా

- తక్కువ ధరకే బంగారం పేరిట మోసాలు
- జిల్లాతోపాటు పలు రాష్ట్రాల్లో నేరాలు
- ప్రధాన నిందితుడు కావలి వాసి
- అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులు

నెల్లూరు(క్రైమ్): తక్కువ ధరకే బంగారం, నకిలీ కరెన్సీ పేరిట మోసాలకు కావలి కేంద్ర బిందువు. పలు ముఠాలు ఈ తరహా నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి జైలుపాలయ్యారు. తాజాగా ఆ కోవలోనే కావలి కచ్చేరిమిట్టకు చెందిన రౌడీషీటర్ కె.విజయ్‌కుమార్ అలియాస్ కృష్ణమోహన్ చౌదరి ముఠాను తెలంగాణ పోలీసులు ఈనెల 18వ తేదీన అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 కేజీల నకిలీ బంగారు బిస్కెట్లు, రూ.51 లక్షల నగదు, రూ.6 కోట్లకుపైగా నకిలీ కరెన్సీ, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా వ్యవహారం ప్రస్తుతం జిల్లాలో కలకలం రేకెత్తిస్తోంది.

డబ్బుపై ఆశతో..

కావలి కచ్చేరిమిట్టకు చెందిన విజయకుమార్ బీటెక్ వరకు చదువుకున్నాడు. స్నేహితులతో కలిసి హత్యాయత్నాలు, కొట్లాటలు చేసేవాడు. అతడిపై కావలి రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో పలు కేసులు నమోదు కావడంతో 2011 సెప్టెంబర్‌లో రౌడీషీట్ తెరిచారు. ఈక్రమంలో సులభ పద్ధతిలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికే పలు ముఠాలు తక్కువ ధరకే బంగారం పేరిట మోసాలకు పాల్పడుతుండడాన్ని గమనించిన విజయకుమార్ తాను ఈ తరహా మోసాలు చేస్తూ డబ్బు సంపాదించాలనుకున్నాడు. అందులో భాగంగా కావలి మద్దూరుపాడుకు చెందిన వృత్తి రీత్యా డ్రైవరైన సునీల్ గవాస్కర్ అలియాస్ హరీష్, నెల్లూరు శివాజీ నగర్ (ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం బోడుప్పల్లో నివాసం)కు చెందిన ఓంసాయి కిరిటీ, తెనాలికి చెందిన ఎస్.డేవిడ్ లివింగ్‌స్టన్ అలియాస్ సెంథిల్‌తో ముఠాను ఏర్పాటు చేశాడు. నకిలీ బంగారు బిస్కెట్లను తయారు చేసి తక్కువ ధరకే బంగారం, నకిలీ కరెన్సీ పేరిట కావలితోపాటు తెలంగాణ రాష్ట్రంలోనూ నేరాలకు పాల్పడసాగారు.



వివరాలను వెల్లడిస్తున్న తెలంగాణ పోలీసులు

నమ్మించి మోసం

సదరు ముఠా ప్రజలు, వ్యాపారుల అత్యాశ, బలహీనతలను ఆసరాగా చేసుకుని మోసాలు చేయసాగారు. చెన్నై, బెంగళూరుల్లోని కస్టమ్స్ అధికారులతో విస్తృత పరిచయాలున్నాయని, వారు సీజ్ చేసిన బంగారు బిస్కెట్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేశామని బంగారు వ్యాపారులు, ప్రజలను నమ్మించేవారు. మార్కెట్ ధర కంటే తక్కువకే వాటిని విక్రయిస్తామని నమ్మబలికేవారు. తొలుత తమవద్ద ఉన్న అసలైన బంగారాన్ని తక్కువ మొత్తానికి విక్రయించి వ్యాపారుల నమ్మకాన్ని పొందేవారు. కావాలంటే వారం రోజుల్లో రెండు కేజీల వరకు అందించగలమని చెబుతారు. వీరి మాటలను నమ్మిన వ్యాపారులు కొంత అడ్వాన్స్ ఇచ్చేవారు. అయితే డెలివరీ మాత్రం బెంగళూరు, చెన్నైలోనే అందిస్తామని ముఠా చెప్పేది. బంగారం కొనుగోలు చేయడానికి బెంగళూరుకు వచ్చిన వారి ముందు ముఠాలోని ఓ వ్యక్తి కస్టమర్‌లా హడావుడి చేసి కేజీల కొద్దీ కొనుగోలు చేస్తాడు. నిజంగానే కొనడానికి వచ్చిన వారు అదంతా చూసి బంగారం అయిపోతోందని భావించి మొత్తం పైకం చెల్లించగా నకిలీ బంగారం ఇస్తారు. అనంతరం కొన్నవారిని ముఠాలోని ఇతర సభ్యులు పోలీసు యూనిఫాంలో ఫాలో చేస్తారు. కొద్దిదూరం వెళ్లగానే వారి వాహనాలను ఆపి తనిఖీ చేస్తారు. బిల్లుల్లేని బంగారం కావడంతో అక్రమ దందా చేస్తున్నారని, కేసులు పెట్టి జైలు నుంచి బయటకు రాకుండా చేస్తామని బెదిరిస్తారు. బిల్లులు చూపించి తీసుకెళ్లాలని ఆ బంగారాన్ని తీసుకుని అక్కడి నుంచి ఉడాయిస్తారు. అప్పనంగా కోట్ల రూపాయల నగదు కొట్టేయడంతోపాటు వారు విక్రయించిన నకిలీ బంగారాన్ని కూడా తిరిగి వారే కొట్టేసి వచ్చిన డబ్బుతో విలాసవంతంగా జీవించసాగారు.

ముఠా అరెస్ట్

మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాను తెలంగాణ రాష్ట్రం రాచకొండ పోలీసులు ఈనెల 18వ తేదీన అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బోడుప్పల్‌కు చెందిన దిలీప్ వ్యాపారి. ఆయన తన స్నేహితుడు సురేష్‌రెడ్డి ద్వారా తక్కువ ధరకే బంగారం విషయం తెలుసుకున్నాడు. ఈఏడాది మే 19వ తేదీన బెంగళూరులో విజయకుమార్, సునీల్ గవాస్కర్‌ను కలిశాడు. దిలీప్ వద్ద నుంచి వారు రూ.6 లక్షలు తీసుకుని 101 గ్రాముల అసలైన బంగారాన్ని ఇచ్చారు. దీంతో దిలీప్ రెండు కేజీల బంగారం కావాలని ఆర్డర్ చేసి అడ్వాన్స్ కింద రూ.20 లక్షలిచ్చాడు. మిగిలిన రూ.90 లక్షల నగదును స్నేహితుడు సురేష్‌రెడ్డితో కలిసి బెంగళూరుకు వెళ్లి విజయకుమార్‌కు ఇచ్చాడు. ఇంకా స్టాక్ రాలేదని, మా మేనేజర్ డేవిడ్‌ను కలుద్దామంటూ చెన్నైలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లాడు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 35లో బంగారాన్ని తీసుకోవాలని డేవిడ్ వారికి చెప్పడంతో తిరుగు ప్రయాణమయ్యారు. అప్పటి నుంచి విజయకుమార్, డేవిడ్‌ల ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఉన్నాయి. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు రంగప్రవేశం చేసి ముఠాను అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారం జిల్లాలో కలకలం రేపింది. ఈ దందాలో ఎవరెవరున్నారు? ఎంత మందిని మోసగించారు? ఎన్ని కోట్ల రూపాయలు సంపాదించారు? ఎక్కడెక్కడ ఆస్తులు కొనుగోలు చేశారు? అనే కోణంలో తెలంగాణ పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

విజయకుమార్‌పై 13 కేసులు

విజయకుమార్‌పై కావలి రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో 2010 నుంచి 2023వ సంవత్సరం వరకు హత్యాయత్నం, కిడ్నాప్, దాడులు, చీటింగ్ తదితరాలకు సంబంధించి 13 కేసులు నమోదయ్యాయి. 2015 నుంచి మోసాలకు పాల్పడుతూనే ఉన్నాడు. నాలుగు కేసుల్లో నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు. మరో నిందితుడైన డేవిడ్‌పై రెండు కేసులున్నాయి.

ఎఫ్‌సీనా.. మళ్లీ చూద్దాంలే..



బస్సును పరిశీలిస్తున్న అధికారులు

- విద్యాసంస్థలు పునః ప్రారంభం
- వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు ముందుకు రాని యాజమాన్యాలు
- ఇంకా అలాగే 587 వాహనాలు
- అధికారుల తనిఖీలు నామమాత్రం

నెల్లూరు(టౌన్): విద్యార్థుల కోసం నడిపే బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) తీసుకోవడంలో విద్యాసంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే స్కూళ్లు, కాలేజీలు పునఃప్రారంభమయ్యాయి. కానీ చాలా వాహనాలకు ఇంత వరకు ఎఫ్‌సీ తీసుకోలేదు. డొక్కు బస్సులు తిప్పుతూ తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లా వ్యాప్తంగా 1,517 విద్యాసంస్థల బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 930 వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఇంకా 587 బస్సులకు ఎఫ్‌సీ తీసుకోవాల్సి ఉంది. విద్యాసంస్థలు పునఃప్రారంభమైనా ఎఫ్‌సీ తీసుకునేందుకు కొన్ని యాజమాన్యాలు మొగ్గ చూపడం లేదు. గత నెల 15వ తేదీతోనే అన్ని విద్యాసంస్థల బస్సుల ఎఫ్‌సీ గడువు ముగిసింది. కళాశాలలు, పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి వాహనాల కండిషన్ చెక్ చేయించుకుని సర్టిఫికెట్ తీసుకోవాలి. కానీ చాలామంది తమకేం పట్టనట్లుగా ఉన్నారు. ఫిట్‌నెట్ లేని బస్సు విద్యార్థులను తిప్పుతూ ప్రమాదానికి గురైతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రధానంగా కొన్ని కాలం చెల్లిన వాహనాలు పిల్లలను ఎక్కించుకుని విద్యార్థులను తీసుకెళ్తున్నాయని ఆరోపణలున్నాయి. జిల్లాలో అధికంగా నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల బస్సులే ఉన్నాయి. వాటికి చెందిన ఎక్కువ బస్సులు కండిషన్‌లో లేనట్లు చెబుతున్నారు. రవాణా అధికారులు వాటిపై కేసుల నమోదు చేసేందుకు ముందుకు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ప్రాంతం	మొత్తం బస్సులు	ఎఫ్‌సీ ఉన్నవి	ఎఫ్‌సీ లేనివి
నెల్లూరు	1,043	698	345
కావలి	247	100	147
ఆత్మకూరు	99	78	21
కందుకూరు	128	54	74

యథేచ్ఛగా తిరుగుతున్నా..

నెల్లూరు నగరంలోనే ఎఫ్‌సీ తీసుకోకుండా 698 బస్సులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వీటిల్లో కొన్ని 15 ఏళ్లు నిండినవి కావడంతో సర్టిఫికెట్ తీసుకునేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. కాగా గ్రామీణ ప్రాంతాల్లో తీసుకుని బస్సులు ఎక్కువగా తిరుగుతున్నట్లు తెలిసింది. ఆ ప్రాంతాలకు రవాణా అధికారులు నెలకో, రెండు నెలలకో ఒకసారి వెళ్తుంటారు. ఆ సమయంలో జాగ్రత్త పడితే చాలు ఏడాది మొత్తం తిరిగేయొచ్చనే భావనలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలున్నాయి. దీంతోపాటు జిల్లాలో నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలకు బ్రాంచ్‌లు ఎక్కువగా ఉన్నాయి. వాటి బస్సులు కూడా అధికంగా తిరుగుతున్నాయి. ఆ వాహనాలను తనిఖీ చేస్తే ఎన్ని ఎఫ్‌సీ లేకుండా తిరుగుతున్నాయో వెలుగులోకి వచ్చే అవకాశముంది. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వాహనాలపై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రజానీకం కోరుతోంది.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తాం. ఇంకా కొన్ని బస్సులకు ఎఫ్‌సీ తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బృందాలుగా ఏర్పడి రవాణా అధికారులు తనిఖీలు చేసి ఎఫ్‌సీ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారు. సర్టిఫికెట్ లేకుండా తిరుగుతూ పట్టుబడితే ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి డీటీసీ

వైద్య విద్యార్థుల హాస్టల్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): జీజీహెచ్ ప్రాంగణంలోని వైద్య విద్యార్థుల హాస్టల్లో గుర్తుతెలియని దుండగులు రూ.3 లక్షల విలువ చేసే వస్తువులు దొంగతనం చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఏసీఎస్‌ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో కె.లక్ష్మీదీప్‌రెడ్డి ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అతను తన సహచర విద్యార్థులు జస్వంత్‌రెడ్డి, లతీష్‌కుమార్, చైతన్యరెడ్డి, సాయితేజ్‌రెడ్డి, రాజత్, భానుకిరణ్‌లతో కలిసి జీజీహెచ్ ప్రాంగణంలోని హాస్టల్లో ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున వారు గది తలుపులు తెరిచి నిద్రపోయారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు గదిలోని ఐదు సెల్‌ఫోన్లు, టైటాన్ వాచ్, రెండు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లను అపహరించుకెళ్లారు. బాధితులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాంకేతికత ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అండగా మేమున్నామంటూ..

- లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి
- సోషల్ మీడియా గ్రూపుల్లో వైరలైన పోస్టు
- రూ.4.50 లక్షల వరకు దాతల సాయం



చికిత్స పొందుతున్న ఆర్మన్

కందుకూరు: సోషల్ మీడియాలో గ్రూపుల్లో వచ్చిన ఓ పోస్టుతో యావత్తు కందుకూరు చలించిపోయింది. ఆపదలో ఉన్న చిన్నారిని ఆదుకునేందుకు దాతలు ముందుకొచ్చారు. తమ ఇంట్లో బిడ్డకు కష్టం వచ్చినట్లుగా భావించి వేగంగా స్పందించారు. ఎవరికి తోచిన సాయం వారు అందించిన పుట్టెడు కష్టాలు ఉన్న ఆ దంపతులకు మేమున్నామంటూ కొండంత ధైర్యాన్ని కల్పించారు. వివరాలిలా ఉన్నాయి. కందుకూరులోని పోతురాజుమిట్ట కాలనీలో షేక్ ఆరిఫ్, అఫ్రీన్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఆరిఫ్ పెయింట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారి రెండో కుమారుడు మూడేళ్ల వయసున్న ఆర్మన్ వారం రోజులుగా చేతులు కొరుక్కోవడం, జట్టు లాక్కోవడం వంటివి చేస్తున్నాడు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందిన ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు విజయవాడలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ వైద్యశాలకు రిఫర్ చేశారు. అక్కడికి వెళ్లిన తర్వాత చిన్నారిని ఐసీయూలో ఉంచిన వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి లివర్ సంబంధిత వ్యాధిగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. బ్రెయిన్‌కు సంబంధించి కూడా కొంత సమస్య ఉనట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో చిన్నారికి వైద్యం అందించేందుకు సుమారు రూ.20 లక్షలు అవుతుందని వైద్యులు సూచనప్రాయంగా తెలియజేశారు. దీంతో ఆ దంపతులు తల్లడిల్లిపోయారు. ఈ విషయాన్ని కందుకూరులోని బంధువులకు, ఇతర స్నేహితులకు ఆరిఫ్ చెప్పుకొని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో అతని స్నేహితులు కొందరు చిన్నారి పరిస్థితిని వివరిస్తూ మంగళవారం పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టి సాయం అందించాలని అభ్యర్థించారు.

ముందుకొచ్చిన దాతలు

ఆర్మన్ వైద్యానికి సాయం చేసేందుకు దాతలు ముందుకొచ్చారు. ఆరిఫ్ ఫోన్‌పేకు తమకు తోచిన నగదును బదిలీ చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో పోస్టును చూసి పట్టణంలోని ప్రముఖుల దగ్గర నుంచి చిరు వ్యాపారాలు చేసుకునే వారు ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున నగదు పంపారు. బుధవారం కందుకూరులోని రెండో పొగాకు వేలం కేంద్రం అధికారులు, సిబ్బంది, బయ్యర్లు కలిసి రూ.51 వేల సాయం అందించారు. అలాగే సూర్య రెస్టారెంట్ యజమాని రూ.20 వేలు, సురేష్‌రెడ్డి చికెన్ సెంటర్ యజమాని సురేష్‌రెడ్డి రూ.25 వేలు, కొండముడుసుపాళెం యూత్ రూ.20 వేలు ఇలా ఎవరికి తోచిన సాయం వారు చేశారు. అలాగే విదేశాల్లో ఉంటున్న కందుకూరు ప్రాంత వాసులు పెద్ద ఎత్తున నగదు పంపారు. ఇప్పటి వరకు రూ.4.50 లక్షల వరకు చిన్నారి వైద్యానికి దాతలు అందించారు.

రక్తహీనత నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాణి మందా, చిత్రంలో డీఎంహెచ్‌ఓ

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

కొడవలూరు: సికిల్ సెల్ అనీమియా (కొడవలి కణ రక్తహీనత) నివారణకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. సికిల్ సెల్ అవేర్‌నెస్ డే సందర్భంగా మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్‌ఎస్‌లో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్రంగా ఉండాల్సిన ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలోకి మారడాన్ని సికిల్ సెల్ అనీమియాగా పిలుస్తారన్నారు. ఈ రక్త కణాలు శరీరంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. శరీరంలోని అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. సాధారణ రక్త కణాల జీవితకాలం 120 రోజులైతే సికిల్ రక్త కణాలవి కేవలం 25 రోజులు మాత్రమేనని చెప్పారు. ఈ వ్యాధి ఉన్నవారు చికిత్స తీసుకోకపోతే తక్కువ వయసులోనే మృత్యువాత పడడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ పీఓ రాణి మందా మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధి ఎక్కువగా గిరిజనుల్లో తలెత్తుతున్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. అందువల్లే ఈ వ్యాధి కారణంగా గిరిజనులు బాధ పడకూడదని ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల్లో రక్త పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు రక్త పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ పరిమళ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, ప్రమోద్, ఏఎన్‌ఎం టి.రాధమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు పద్మజ, సరోజ, స్నేహ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



నెల్లూరు(క్రైమ్): ఉదయగిరి నుంచి మంగళవారం రాత్రి నెల్లూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు సాలుచింతల జంక్షన్ వద్ద గుర్తుతెలియని మహిళ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వివరాల కోసం చుట్టుపక్కల వారిని ఆరాతీయగా ఆమె కొన్ని సంవత్సరాలుగా అదే ప్రాంతంలో భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తోందని, ఒక కుమారుడున్నాడని స్థానికులు తెలిపారు. అయితే ఆమె పేరు, ఏ ఊరనే వివరాలు తమకు తెలియదని చెప్పారు. మృతురాలి వయసు 60 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె వివరాలు తెలిసిన వారు నార్త్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై బుధవారం కోరారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.60
సన్నవి : రూ.40
పండ్లు : రూ.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 150
లేయర్ (లైవ్) : 120
బ్రాయిలర్ చికెన్ : 264
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 294
లేయర్ చికెన్ : 204